

క్లుప్తంగా

కరపత్రాలు విడుదల

మక్తల్: ఏబీసీడీ వర్గీకరణ బిల్లును నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో టీఎమ్మార్పీఎస్ ఆధ్వరంలో ఈ నెల 30న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు. అదేవిధంగా 31 ధర్నా ఉంటుందని వివరించారు. ఈ మేరకు గురువారం పట్టణంలో కరపత్రాలు విడుదల చేశారు. పెద్దసంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు. కర్రెమ్అంజి, అరుణ్‌కుమార్, రంజిత్‌కుమార్, హన్మంతు, అంజప్ప, శివరాజ్, చెన్నప్ప పాల్గొన్నారు.

యాత్రను జయప్రదం చేద్దాం

దామరగిద్ద: బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న జన చైతన్య యాత్రను జయప్రదం చేద్దామని జిల్లా నాయకుడు అంజిలయ్యగౌడ్, సర్పంచ్ లాలప్ప పిలుపునిచ్చారు. మండలంలోని ముస్తాపేట్‌లో గురువారం బస్సుయాత్ర వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ నెల 27న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న బహిరంగ సభకు భారీసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కాశప్ప, గోవింద్, రాజు, బస్సప్ప పాల్గొన్నారు.

గ్రామసభల ఏర్పాటు

ఊట్కూరు: గ్రామాల అభివృద్ధికి పాటుపడుతామని సర్పంచ్‌లు సూర్యప్రకాశ్‌రెడ్డి, సావిత్రమ్మలు అన్నారు. గురువారం ఊట్కూరు, బిజ్వార్‌లో గ్రామసభలను నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల నివేదికను గ్రామసభలో చదివి వినిపించారు. కార్యదర్శులు సుమలత, మంజుల, ఉప సర్పంచ్‌లు పొర్ల నర్సింహులు, ఇబాదూర్ రహెమాన్, పశువైద్యాధికారి డాక్టర్ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

25న ఆర్థో హెల్త్ క్యాంప్

మద్దూరు: కోస్గిలో ఈ నెల 25న కమిట్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఆర్థో హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంబలికేంద్రం ఏర్పాటు

మరికల్: బాటసారులను దృష్టిలో ఉంచుకొని తీలేర్ స్టేజీ వద్ద 42 ఏళ్ల నుంచి అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తీలేర్ మాజీ మాజీ సర్పంచ్‌లు వెంకారెడ్డి, వజ్రమ్మ, మాజీ ఎమ్మెల్యే ఆప్కాబ్ చైర్మన్ కె.వీరారెడ్డిల జ్ఞాపకర్థంగా గురువారం రాగి అంబలి కేంద్రాన్ని సర్పంచ్ రేవతమ్మతో కలిసి ప్రారంభించారు. ఉపసర్పంచ్ భంజరప్ప, ప్రదీప్‌కుమార్‌గౌడ్, తిమ్మారెడ్డి, వెంకట్రాములు, కుర్మయ్య, శివరాములు, శ్రీనివాస్, రాంచంద్రయ్య, బాల్‌రాజ్, పాల్గొన్నారు.

80 మందికి నేత్ర పరీక్షలు

కోస్గి: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, లయన్స్ క్లబ్ కోస్గి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో నేత్ర వైద్యులు భాస్కర్ గౌడ్ మొత్తం 80 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 35 మందికి కంటిలో శుక్లాలు గుర్తించారు. వారికి పాలమూర్ జిల్లా కేంద్రంలోని లయన్ రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. క్లబ్ అధ్యక్షుడు బెజ్జు వెంకట్రాములు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

మాగనూర్: అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని మాగనూర్ ఏఎస్ఐ మన్నన్ అన్నారు. గురువారం కళాజాతా బృందంతో గజ్జరందొడ్డిలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పలు సూచనలు చేశారు. కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్, కల్యాణి, శేఖర్, లింగన్న, బుక్య నాయక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

మాగనూర్: రోడ్డు ప్రమాదంలో మహిళ గాయపడిన ఘటన మండల కేంద్రం సమీపంలోని శ్రీ లక్ష్మీ నరసింహ పెట్రోల్ బంక్ ఎదురుగా గురువారం చోటు చేసుకుంది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం. నల్లగట్టు మారెమ్మ ఆలయం వైపు నుంచి రెండు ద్విచక్ర వాహనాలు వస్తున్నాయి. కొంత దూరంలో ముందుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు సిగ్నల్ ఇవ్వా పెట్రోల్ బంక్ వైపు వాహనాన్ని మళ్లించాడు. ఈ క్రమంలో అది గమనించకుండా కృష్ణా మండల కేంద్రానికి చెందిన మరో ద్విచక్రవాహనదారుడు ఒక్కసారిగా ముందు వాహనం వైపు వచ్చాడు. తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి కింద పడిపోయారు. దీంతో సదరు వాహనంపై ఉన్న మహిళ వీణ గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఆమెను రాయచూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

'ప్రజా'హితం.. 'సాక్షి' అభిమతం

నిదర్శనం

సంతోషంగా ఉంది..



ప్రభుత్వం దళితులకు ఇచ్చిన మూడు ఎకరాల భూమి తమకు సర్వే చేసి ఇవ్వడం సంతోషంగా ఉంది. త్వరలోనే మాకు పట్టాపాసు పుస్తకాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వరుస కథనాలతో మా సమస్య పరిష్కారం అవుతున్నందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– వై.భాగ్యమ్మ, లబ్ధిదారు, కిష్టాపూర్, ధన్వాడ మండలం

ముగిసిన సర్వే..





నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కిష్టాపూర్‌లో 2015–16లో దళితులకు ఒక్కొక్కరికీ 3ఎకరాల చొప్పున 50 మందికి ఇచ్చారు. అయితే వారికి సర్వే చేసి హద్దులు చూపించాలని రైతులు వేడుకున్నారు. ఈ భూములపై 2020 అక్టోబర్ 24న 'సర్వే చేయరు.. సరిహద్దులు చూపరు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికార యంత్రాంగం సర్వేకు ఆదేశించింది. అయినా అధికారుల నిర్లక్ష్యంతో సర్వే కాకపోవడంతో.. మరోసారి 2020 నవంబర్ 17న సర్వే ఇంకెన్నాళ్లు అంటూ కథనం ప్రచురితమైంది. అప్పటి కలెక్టర్ హరిచందన స్పందిస్తూ 150 ఎకరాలను సర్వే చేసేందుకు కమిటీని నియమించడంతో జిల్లా సర్వేయర్ల బృందం సర్వేకు పూనుకుంది. అయినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది. 2022 డిసెంబర్ 26న హద్దు లెక్కడ? భూ పంపిణీ చేసినా సరిహద్దులు చూపని అధికారులు అంటూ కథనం ప్రచురితమైంది. ప్రస్తుత కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి స్పందించారు. ఆ భూములపై సర్వే చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో జిల్లా సర్వేయర్ల బృందం, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి సర్వేను పూర్తి చేశారు. మరో వారంరోజుల్లో లబ్ధిదారులకు భూ పట్టాపాసు పుస్తకాలు చేతికి వచ్చేపరిస్థితి కానవస్తుంది.

'భూమి సర్కారు'కు వచ్చిన వేళ!



నారాయణపేట జిల్లాలోని ఊట్కూర్ మండలంలో దంతన్‌పల్లి శివారులో ప్రభుత్వ భూమిని కాజేసిన ఓ వీఆర్‌ఓ, ముగ్గురు వీఆర్‌ఏలపై 'సర్కారు భూమికి ఎసరు' శీర్షికన 2020 ఫిబ్రవరి 8న, భూ మాయ.. మరో 75 ఎకరాల ప్రభుత్వ భూమి బదలాయింపుపై 2020 ఫిబ్రవరి 10న కథనం ప్రచురితమైంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆ భూములపై విచారణ జరిపించారు. ఆ తర్వాత విచారణలో ప్రభుత్వ భూములకు ఎసరుపెట్టిన వీఆర్‌ఏలు, వీఆర్‌ఓపై వేటు వేశారు.



సాక్షి కథనంతో వసూళ్లకు చెక్



కోస్గి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వైనంపై సాక్షిలో గతనెల 27న 'వసూళ్ల పర్వం' అంటూ సమగ్ర వివరాలతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా అధికారులు విచారణ చేశారు. బాధిత రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అక్రమ వసూళ్లు నిజం కావడంతో పెనుమార్పులకు తెర తీశారు. ఇకపై ఎవరైనా డబ్బులు అడిగితే నేరుగా ఫోన్ చేయాలని జిల్లా ఉన్నత అధికారుల ఫోన్ నంబర్లతో ఆ కేంద్రంలో బోర్డు ఏర్పాటు చేశారు. సొంత వాహనాలతో ట్రాన్స్‌ఫార్మర్ తీసుకువస్తే రవాణా చార్జీలు చెల్లించే విధానాన్ని అప్పటికప్పుడు అమలు చేస్తున్నట్లు ప్రకటించి అమలుచేస్తున్నారు.

– వెంకట్రాములు, రైతు, కోస్గి



ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు: కలెక్టర్

నారాయణపేట: గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు చేయించుకోవాలని కలెక్టర్ శ్రీ హర్ష కోరా రు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ఇతర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేశామని తెలిపారు. మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలు, క్రిష్ణ, మాగనూర్ మండలాల్లో గర్భిణులు రాయిచూరు, నారాయణపేట, మహబూబ్‌నగర్‌లకు ప్రసవాలకు వెళ్లి అవస్థలు పడుతున్నారని, ఏప్రిల్ 1నుంచి మక్తల్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రత్యేక వైద్యుల బృందాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటికే ఆధునికంగా లేబర్ రూమ్ (డెలివరీ రూమ్)ను తీర్చిదిద్దామని, నార్మల్ ప్రసవాలతో పాటు సిజేరియన్ ద్వారా ప్రసవాలు (అత్యవసర పరిస్థితుల్లో) చేసేందుకు సుశిక్షితులైన ప్రభుత్వ వైద్యుల, స్టాఫ్ నర్సులను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మక్తల్ మున్సిపాలిటీ, మండల పరిధిలోని గర్భిణులకు మక్తల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సౌకర్యాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆశావర్కర్లపై ఉందని పేర్కొన్నారు.

పదోన్నతులు బాధ్యతను పెంచుతాయి



నారాయణపేట రూరల్: విధి నిర్వహణలో పదోన్నతులు బాధ్యతను మరింత పెంచుతాయని ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లాకు చెందిన 35మంది కానిస్టేబుళ్లు పదోన్నతి పొంది హెడ్ కానిస్టేబుళ్లుగా నెలన్నర రోజులు కరీంనగర్ పీటీసీలో శిక్షణ పొందారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో రిపోర్టు చేశారు. ఈ మేరకు వారితో సమావేశమైన ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతి ఉత్సాహంతో పాటు బాధ్యతను గుర్తు చేస్తుందని, సమయపాలన, క్రమశిక్షణను తప్పకుండా పాటించాలన్నారు. పీఎస్‌లలో ప్రధాన భూమికను పోషించాల్సి ఉంటుందన్నారు. ఫిర్యాదుదారులు వచ్చినప్పుడు మర్యాదగా వ్యవహరించాలని, ఫ్రెండ్లీగా ఉండి వారి సమస్యలను తెలుసుకుని అండగా నిలవాలన్నారు. పీఎస్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికీ భద్రత, భరోసా ఇవ్వగలిగినప్పుడే పోలీసు ఉద్యోగానికి న్యాయం చేసినట్లని చెప్పారు. వ్యాయామం, యోగా, ధ్యానం చేస్తూ పరేడ్‌లో పాల్గొనాలని ఆరోగ్యాన్ని కాపాడుతూ, కుటుంబానికి సమయం ఇవ్వాలన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాల్సిందే: కలెక్టర్

నారాయణపేట: మన ఊరు మన బడి పనులు ఈనెలాఖరు వరకు పూర్తి చేయాలని, ఎఫ్‌టీఓలు అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, డీపీఓ సిబ్బందితో మన ఊరు మన బడి పనులపై గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్ వంటి పనులు త్వరగా పూర్తి చేయాల్సిందేనన్నారు. హెల్త్ సబ్ సెంటర్లకు అవసరమైన మరమ్మతులు పూర్తి చేసి ఆయుష్మాన్ భారత్‌కు అప్పగించాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు పెయింటింగ్, బొమ్మలు, ఎథనిక్ డిజైన్‌లోగో వేసి అందుకు సంబంధించిన ఫొటోలు కేంద ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అవుతాయన్నారు. శుక్రవారం సాయంత్రంలోగా యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ఫొటోలు పంపాలని ఆదేశించారు. జిల్లాలో 59 సెంటర్లను ఆయుష్మాన్ భారత్ సెంటర్లుగా గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో మెటీరియల్ కాంపోనెంట్ కింద మంజూరైన సీసీరోడ్లను ఈ నెలఖరు వరకు పూర్తి చేసి ఎఫ్‌టీఓలు ఆప్‌లోడ్ చేయాల్సిందిగా ఆదేశించారు. పంచాయతీరాజ్ రోడ్లపై సమీక్ష నిర్వహిస్తూ బీటీ చేయాల్సిన పనులపై త్వరగా పూర్తి చేసే విధంగా కాంట్రాక్టర్ల వెంటపడి త్వరగా పూర్తి చేయించాలని చెప్పారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్, పీఆర్ ఈఈ నరేందర్, డీపీఓ మురళి, ఏఈలు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ బహిష్కరణ



కమీషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మైనార్టీలు

మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన

కోస్గి: ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అందించే రాయితీ రుణాల కోసం గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉండగా ముస్లిం, మైనార్టీలు ఇంటర్వ్యూలను బహిష్కరించి నిరసన తెలిపారు. వేల సంఖ్యలో ముస్లిం, మైనార్టీలు ఉంటే కేవలం 6 యూనిట్లు మాత్రమే కేటాయించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం మున్సిపల్ పరిధి అంటూ అధికారులు దరఖాస్తులు చేయమంటే 137 మంది పేద వర్గం వారు దరఖాస్తు చేసుకున్నారని, అధికారులు మాత్రం కేవలం 6 యూనిట్లు కేటాయించడంతో రుణాలతో ఎవరికి లాభం లేకుండా పోతుందన్నారు. యూనిట్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తూ కమిషనర్ పూర్ణచందర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఇందులో పలువురు లబ్ధిదారులు, మైనార్టీ సంఘం నాయకులు పాల్గొన్నారు. ఇదే విషయమై కమిషనర్‌ను వివరణ కోరగా, కలెక్టర్‌కు సమాచారం ఇచ్చి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



బిజ్వార్‌లో మాట్లాడుతున్న నాయకులు

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండల కేంద్రాలు, గ్రామాల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పీడీఎస్‌యూ, పీవైఎల్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా తదితర పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

పంచాయతీ దుకాణాలను వేలం వేయాలి

మరికల్: గ్రామ పంచాయతీ దుకాణాలను వేలం వేయాలని యువక మండలి సభ్యులు గ్రామసభలో ఆందోళన చేపట్టారు. మరికల్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన అత్యవసర గ్రామసభ 35 ఏళ్ల నుంచి పంచాయతీకి సంబంధించిన 45 దుకాణాలు వేలం వేయకుండా రాజకీయ పార్టీల నాయకులు అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీకి రావాల్సిన ఆదాయంపై దళారీలుగా వ్యవహరిస్తున్న కొందరు నాయకులు లబ్ధిపొందుతుండడంప సర్పంచ్ గోవర్ధన్‌ను నిలదీశారు. కానీ ఆయన ఏమీ పట్టనట్లుగా నవ్వుతూ దాటవేశారని ఆరోపించారు. గ్రామంలో అనేక సమస్యలు తాండవం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విషయంపై కలెక్టర్‌తో మాట్లాడతామని హెచ్చరించారు. ఎంపీఓ బాలజీ, ఉపసర్పంచ్ శివ, కార్యదర్శి శ్రీనివాస్‌రావు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో విద్యుత్ సౌధ



మద్దూరు: తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్–82 రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారంవిద్యుత్ సౌధా వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి వినోద్ పిలుపు నిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ఆర్టిజన్ ఉద్యోగులను రెగ్యులర్ చేశామని చెప్పినా అమలు కాలేదన్నారు. నాయకులు తిరుపతిరెడ్డి, రాములు, గుండప్ప, వెంకట్‌రాములు, పాల్గొన్నారు.

198 మందికి ఇంటర్వ్యూలు

మద్దూరు: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసే రుణాల కోసం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుదారులకు బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మద్దూరు రెనివట్ల ఎస్‌బీఐ, గుండుమాల్, మద్దూరు, కోస్గి ఏపీజీవీబీ, ఐఓబీ లింగల్‌చేడ్ బ్యాంకు అధికారులు కార్యక్రమంలో పాల్గొని ధ్రువపత్రాలు పరిశీలించారు. మొత్తం 286 మంది అభ్యర్థులకు గానూ 198 మంది హాజరైనట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు.



పెండింగ్ బిల్లులు క్లియర్ చేయండి

మక్తల్: ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని జిల్లా కేంద్రంలో ఈనెల 24న ట్రెజరీ కార్యాలయం ఎదుట యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టనున్నట్లు ఆ సంఘం నాయకులు గురువారం తెలిపారు. మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సూర్యచంద్ర, వెంకటస్వామి, వేణుగోపాల్, వెంకటేష్, పరంజ్యోతి, లక్ష్మణ్, స్పందన పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని కోరుతూ తపస్ ఆధ్వర్యంలో డీటీఓ యాదగిరికి గురువారం వినతిపత్రం అందించారు. తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, జిల్లా సెక్రెటరీ నర్సింహా, ఊట్కూర్, దామరగిద్ద మండలాల అధ్యక్షులు రవికుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

కృష్ణా: గుడెబల్లూర్ గ్రామస్తులకు తాగునీటి సమస్యకు సింగిల్ విండో డైరెక్టర్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు విజయగౌడ్ పరిష్కారం చూపారు. తన సొంత నిధులతో కృష్ణానది నుంచి పైప్‌లైన్ ద్వారా నీరు సరఫరా అయ్యేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు విజయగౌడ్‌ను గురువారం అభినందించారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్టు

నారాయణపేట టౌన్ : రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు ముట్టడికి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. జిల్లా అధ్యక్షుడు కోట్ల రవీందర్, కౌన్సిలర్ ఎం.డి సలీం, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు యూసుఫ్‌తాజ్, నాయకులు విజయ్, ఆనంద్ ఉన్నారు.

నర్వ: మండలంలో అరెస్టయిన వారిలో కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్, నాయకులు శరణప్ప, నీరజ్, వివేకవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, అయ్యపురెడ్డి, సంజీవరెడ్డి, మహేష్, రవి తదితరులున్నారు.

మరికల్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నా పత్రాల లీకేజ్ వ్యవహారంలో ప్రగతి భవన్ ముట్టడికి తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులను గురువారం మరికల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మండల అధ్యక్షుడు వీరన్న, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

మాగనూర్: రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు మండలం నుంచి తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నాయకులు ఉజ్జెల్లి కృష్ణయ్య, చక్రపాణిరెడ్డి, ఆనంద్, మౌళాలి, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉత్సవాలు

దామరగిద్ద: మండలలోని క్యాతన్‌పల్లిలో భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం రుద్రాభిషేకం, పల్లకీసేవా, నందికోలుతో పురంతులసేవా, పూల పథోత్సవం, 26న అగ్నిగుండ ప్రవేశం, రుద్రాభిషేకం, డోలారోహణం నిర్వహించనున్నారు.

దుకాణాల నిర్వహణకు అనుమతి ఇవ్వాలి

నారాయణపేట రూరల్ : రంజాన్ మాసంలో వ్యాపార సముదాయాలకు అర్ధరాత్రి వరకు కొనసాగించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ ఎంఐఎం నాయకులు గురువారం ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు రోజాలో ఉంటారని, రాత్రి వేళల్లో దుస్తులు, హోటళ్లు, పాన్‌దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఖాదార్, సయ్యద్, మహ్మద్, తాకీచాంద్, తాహిర్, షరీఫ్, కురేషీ పాల్గొన్నారు.



ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

ఊట్కూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. గురువారం ఊట్కూరులోని ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. మండలంలో కొనసాగుతున్న పనుల గురించి ఈసీ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. మండలంలో 896 మంది కూలీలు పనిచేస్తున్నారని, జీపీల వారీగా 41 శాతం కూలీలు పనులకు హాజరవుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. వేసవి కాలంలో ఉపాధి పనుల్లో కూలీలు తక్కువగా హాజరుకావడం పట్ల ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీల సంఖ్య వందశాతం పెంచాలని, లేని పక్షంలో సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా మొక్కల చుట్టూ పాదులు తవ్వి నీరు పోయాలని సూచించారు. ఉపాధి పనుల్లో అక్రమాలు చోటు చేసుకోకుండా పారదర్శకంగా చేపట్టే బాధ్యత అధికారులదే అన్నారు. మస్టర్లలో బినామీ కూలీల హాజరు వేసినట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వచ్చే నెలలో చేపట్టే ఉపాధి పనుల్లో పురోగతి కనిపించకపోతే ఉపేక్షించబోమని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో టీఏలు తదితర సిబ్బంది నిత్యం దగ్గర ఉండి పనులను పరిశీలించాలన్నారు. సూపరింటెండెంట్ కొండయ్య, ఎంపీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధి హామీ ఈసీ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, టీఏ గోపాల్, శివ, జగదీశ్, మాణిక్‌రావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నారాయణపేట రూరల్ : ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు నిర్వహించిన గణితం, జువాలజీ, హిస్టరీ పరీక్షలో జిల్లా వ్యాప్తంగా 3035 మంది రెగ్యులర్ విద్యార్థులకు గానూ 2932మంది హాజరుకాగా 103మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. అదేవిధంగా 575మంది ఒకేషనల్ విద్యార్థులకు గానూ 553మంది పరీక్ష రాశారు. 22మంది గైర్హాజరయ్యారు. జిల్లా తనిఖీ బృందం అధికారులు ఊట్కూర్, దామరగిద్ద, కోస్గిలో పర్యటించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ధన్వాడ, మరికల్ సిట్టింగ్ స్క్వాడ్ దామరగిద్ద, ఊట్కూర్ కేంద్రాలు పరిశీలించారు.

ఎమ్మార్సీలో పాము కలకలం

నర్వ: స్థానిక ఎమ్మార్సీలో గురువారం నాగుపాము కలకలం రేపింది. కార్యాలయంలో ఎంఐఈ రైసబానుకు పాము కనబడడంతో సహచర ఉద్యోగులు, సీఆర్పీలు నర్సిములు, రాంరెడ్డికి సమాచారం అందించింది. దీంతో వారు పామును పట్టే వ్యక్తిని తీసుకువచ్చారు. కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లో పాము ఉండడంతో బయటకు తీశాడు. అనంతరం దూరంగా వదిలిపెట్టాడు.